కర్నూలు సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యత

- 11 తీర్మానాలకు నగరపాలక స్థాయి సంఘం ఆమోదం
- రూ.2.71 కోట్ల అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్


అభివృద్ధి అంశాలపై స్టాండింగ్ కమిటీలో చర్చిస్తున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): కర్నూలు నగర సమగ్రాభివృద్ధితో పాటు ఆదాయం పెంచుకునే మార్గాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు నగర మేయర్ బీవై రామయ్య వెల్లడించారు. మంగళవారం సాయంత్రం స్థానిక నగరపాలకలోని తన చాంబర్‌లో మేయర్ నగరపాలక స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ భార్గవ్‌తేజ, స్టాండింగ్ కమిటీ సభ్యులు పుల్లమ్మ, సాన శ్రీనివాసులు, వైజ.అరుణ, రాజేశ్వరరెడ్డి, మల్లికాబేగంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కర్నూలు నగరపాలక సంస్థ పాలకవర్గం ఏడాదిన్నరలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రతి వార్డు, ప్రతి వీధిలో సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. నగరంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై స్టాండింగ్ కమిటీ చర్చించింది. మొత్తం 11 తీర్మానాలకు ఆమోదం తెలిపారు. రూ.2.71 కోట్ల అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సమావేశంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ రమాదేవి, కార్యదర్శి లావణ్య, ఇన్‌చార్జ్ ఎస్‌ఈ శేషసాయి, ఎంహెచ్‌ఓ విశ్వేశ్వరరెడ్డి, సీటీప్లానర్ ప్రదీప్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు హరీష్ చౌదరి, ఇన్‌చార్జ్ ఎంఈ షాకీర్ హుస్సేన్, డీఈఈలు రవిప్రకాష్, రాజశేఖర్, గోపాలకృష్ణ, ఆర్‌ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల వివరాలు :

- కర్నూలు నగరపాలక సంస్థ ఆర్థిక పరిస్థితిని మరింత మెరుగు పరిచేందుకు సంస్థ పరిధిలోని సర్వే నంబర్ 734, 735లలో లేఅవుట్ నంబర్ 6/72లో సి.క్యాంపు నుంచి నంద్యాల చెక్‌పోస్టు రోడ్డు కుడివైపు డ్రైనేజీ పంపు హౌస్ వద్ద ఉన్న 18 సెంట్ల స్థలంలో స్వతహాగా పెట్రోల్, డీజిల్ పంపు ఔట్‌లెట్ ఏర్పాటు చేసుకునేందుకు ఆమోదం తెలిపారు.
- కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని సర్వే నంబర్ 688 (ఏ)లో జొహరాపురం నుంచి నందికొట్కూర్ రోడ్డుకు వెళ్లే 60 అడుగుల రోడ్డుకు కుడివైపున ఉన్న నగరపాలక సంస్థకు చెందిన 20 సెంట్ల స్థలంలో స్వతహాగా పెట్రోల్, డీజిల్ పంప్ ఔట్‌లెట్ ఏర్పాటుకు ఆమోదం.
- కర్నూలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న 4వ తరగతి ఉద్యోగులకు యూనిఫాం, చీరెలు, రవికెలు, టవల్స్, రెండు జతల చెప్పులను 2022–23 ఆర్థిక సంవత్సరానికి విశాఖపట్నంకు చెందిన లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్ ఎంపోరియమ్ (స్టేట్ గవర్నమెంటు అండర్ టేకింగ్ ఏజెన్సీ) ద్వారా కొనుగోలు చేసేందుకు రూ.20.60 లక్షలు చెల్లించేందుకు ఆమోదం.
- మునగాల పాడు వద్ద కొత్తగా నిర్మిస్తున్న 15 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రం వద్ద పైపులైన్, ప్రహరీ గోడ, రోడ్లు వేసేందుకు రూ.1.30 కోట్ల నిధులకు ఆమోదం తెలిపారు.
- అశోక్ నగర్ హెడ్ వాటర్ వర్క్స్‌లో క్లోరినేషన్, సెన్సార్ ఏర్పాటుకు రూ.33.50 లక్షలు కేటాయిస్తు కమిటీ తీర్మానం చేసింది.
- రిలయన్స్ మార్కెట్ నుంచి నాయుడు ఫంక్షన్ హాలు వరకు కొత్తగా పైపులైన్ వేసేందుకు రూ.17 లక్షలు కేటాయించారు.
- కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో గఫూర్ నగర్ వద్ద ఉన్న సైంటిఫిక్ పార్కులో రూ.1.80 కోట్లతో వాకింగ్ ట్రాక్, సైన్సు ఎక్విప్‌మెంటు, వాటర్ ఫాల్స్ వంటి అభివృద్ధి పనులు, మెయింటనెన్స్‌కు పే అండ్ ప్లే పద్ధతిన పార్కు ప్రవేశానికి రోజుకు రూ.5లు, నెల పాస్ రూ.100లు చొప్పున బహిరంగ వేలం ద్వారా కేటాయించేందుకు ఆమోదం తెలిపారు.
- 35వ వార్డు చెన్నమ్మ సర్కిల్ కూడలి నుంచి సుంకులమ్మ పరమేశ్వరి గుడి వరకు బీటీ రోడ్డు వెడల్పు చేయడం, సెంట్రల్ మీడియన్ నిర్మించేందుకు రూ.50 లక్షలు కేటాయించారు.
- 2వ వార్డు కింగ్ మార్కెట్ వద్ద అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాలుకు టాయిలెట్లు, కిచెన్‌షెడ్డు, ఫ్లోరింగ్, పెయింటింగ్, విద్యుత్ సరఫరా, వాటర్ సరఫరా తదితర అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు కేటాయించారు.
- నగరపాలక సంస్థలో పనిచేస్తున్న రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.10 లక్షలు జీవిత బీమా చేసేందుకు ఒక్కొక్కరికి రూ.396లు చొప్పున ఖర్చు చేసేందుకు ఆమోదం వ్యక్తం చేశారు.
- కర్నూలు నగరంలోని 19వ వార్డులో ఉన్న లేఅవుట్ నంబర్ 531/82లో అదనపు ఓపెన్ స్పేస్‌ను హైకోర్టు ఉత్తర్వుల మేరకు డీ–రిజర్వు చేసేందుకు ఆమోదం తెలిపారు.

26న జంతువధ నిషేధం

కర్నూలు (టౌన్): ఈ నెల 26వ తేదీ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నగర పాలక సంస్థ పరిధిలో అన్ని మాంసం, చికెన్, చేపల దుకాణాలను బంద్ చేయాలని నగరపాలక సంస్థ పశువైద్యాధికారి డాక్టర్ బి.మల్లన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు అతిక్రమించి మాంసపు దుకాణాలు తెరచి అమ్మకాలు చేపడితే భారీ జరిమానాలు, ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. జంతువధ నిషేధానికి వ్యాపారులు సహకరించాలని కోరారు.

వాలీబాల్ పోటీలు


తలపడుతున్న శ్రీకాకుళం, పశ్చిమగోదావరి జట్లు

కర్నూలు (టౌన్): రెండు రోజులుగా స్థానిక మాంటిస్సోరి పాఠశాల క్రీడామైదానంలో జరుగుతున్న 66వ రాష్ట్ర స్థాయి అండర్–17 వాలీబాల్ బాల బాలికల పోటీలు మంగళవారం రసవత్తరంగా సాగాయి. సెమీఫైనల్స్‌కు శ్రీకాకుళం, పశ్చిమగోదావరి (బాలుర విభాగం), విజయనగరం, విశాఖపట్నం జట్లు (బాలికల విభాగం) చేరుకున్నాయి. కాగా క్వార్టర్ ఫైనల్ బాలుర విభాగం పోటీల్లో అనంతపురం జట్టుపై శ్రీకాకుళం జట్టు, కృష్ణ జిల్లా జట్టుపై పశ్చిమగోదావరి జిల్లా జట్టు, బాలికల విభాగంలో అనంతపురం జట్టుపై విజయనగరం జట్టు, వైఎస్సార్ జిల్లా జట్టుపై విశాఖపట్నం జట్టు విజయం సాధించాయి.

క్లుప్తంగా

గంగమ్మకు బోనాల సమర్పణ


బోనాలు సమర్పించేందుకు వెళుతున్న భక్తులు

కర్నూలు కల్చరల్: జొహరాపురం సమీపంలో హంద్రీ తీరాన వెలసిన గంగమ్మకు మంగళవారం భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. గంగ పుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవంలో భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్వీ సుబ్బారెడ్డి ఫౌండేషన్ వైస్ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం కమిటీ అధ్యక్షులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు ఇన్‌చార్జ్ బాధ్యతలు

కర్నూలు (టౌన్): సెలవుల్లో ఉంటున్న సచివాలయ ఉద్యోగుల స్థానాల్లో నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ ఇతర సచివాలయాల ఉద్యోగులకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇందిరాగాంధీనగర్–1 సచివాలయానికి రాచపూడి విద్యాసాగర్, ఇందిరాగాంధీ నగర్ –2 సచివాలయానికి రాచపూడి విద్యా సాగర్,జెఎస్ఆర్ నగర్ సచివాలయానికి డి.సౌజన్య, మంగళగేరిలో ఉన్న సచివాలయానికి ఎస్.శ్రీజ, పందిపాడు సచివాలయానికి బోయ రామనాయుడుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆప్ ఎన్నికల్లో పోటీ చేస్తుంది

కర్నూలు కల్చరల్: రాష్ట్రంలో ఆమ్ ఆద్మీ పార్టీ వచ్చే అన్ని ఎన్నికల్లో పోటీ చేస్తుందని ఆప్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ ఆర్.మణినాయుడు, ఏపీ స్టేట్ కన్వీనర్ వరప్రసాద్ వెల్లడించారు. మంళవారం కర్నూలు నగరంలోని దేవి ఫంక్షన్ హాల్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీని బలోపేతం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ ఆర్గనైజింగ్ ఉపాధ్యక్షులు ఆర్.కె.పట్టంరాజు, ఈ–జోన్ కోఆర్డినేటర్ జయకుమార్, రాయలసీమ జోన్ కో కన్వీనర్ బి.వి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌పై చెట్లు పుట్టుకొస్తున్నాయ్!


భవనంపై మొక్కలు పెరిగిన దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా పరిపాలన కేంద్రమైన కలెక్టరేట్‌పై చెట్లు పుట్టుకొస్తున్నాయి. కలెక్టరేట్ నిర్వహణను ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ఎటు చూసినా చెత్త చెదారం పేరుకుపోతోంది. జిల్లా పరిపాలన కేంద్రంలోనే పారిశుద్ధ్య లోపం స్పష్టంగా కనిపిస్తుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. కలెక్టరేట్‌లో 35 ప్రభుత్వ విభాగాలు ఉన్నాయి. వందలాది ఉద్యోగులు పనిచేస్తున్నారు. సందర్శకులు కూడా ప్రతి రోజు వివిధ సమస్యల పరిష్కారం కోసం వందలాది మంది వస్తుంటారు. అయితే కలెక్టరేట్‌లో తాగడానికి నీళ్లు ఉండవు. అత్యవసరాలు తీర్చుకోవడానికి ఎలాంటి సదుపాయాలు లేవు. దీంతో ఇటు ఉద్యోగులు, అటు సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోడలకు, పైన ఇనుమ కడ్డీలకు కట్టిన సిమెంటు పిల్లర్స్ శిథిలమై పోయాయి. ఈ సిమెంటు దిమ్మెల శిథిలాల్లో చెట్లు పెరుగుతుండటంతో పై కప్పుకు పగుళ్లు ఏర్పడుతున్నాయి. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా కలెక్టరేట్ చిత్తడిగా మారుతోంది. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కొలువైన కలెక్టరేట్ స్థితిగతులను పరిశీలించిన దాఖలాలు లేవని ఉద్యోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా కలెక్టరేట్ నిర్వహణపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.


కలెక్టరేట్‌లో పేరుకుపోయిన చెత్త చెదారం

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : పఠాన్, వీర సింహారెడ్డి , వాల్తేరు వీరయ్య ,వారసుడు, తెగింపు
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : ధమాకా, వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు, తెగింపు
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వాల్తేరు వీరయ్య
ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్, పఠాన్, పుష్ ఇన్ బూస్ట్స్ ది లాస్ట్ విష్
భరత్ కాంప్లెక్స్ : పఠాన్ , తెగింపు
రాజ్ : వీర సింహారెడ్డి
శ్రీరామ : వాల్తేరు వీరయ్య
విజయ : పఠాన్

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం


ఆటల పోటీల్లో విద్యార్థినులు

కర్నూలు కల్చరల్: కర్నూలు ప్రభుత్వ (పురుషుల) డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళా సాధికారత విభాగం (డబ్ల్యూఈసీ) ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కళావతి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారత మాజీ, ప్రథమ మహిళా ప్రధాని ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జనవరి 24వ తేదీన బాలికా దినోత్సవం జరుపుకోవడం మహిళా శక్తి, సాధికారతకు నిదర్శనమన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.సత్యనారాయణ, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ బి.సుజాత మాట్లాడారు. విద్యార్థినులకు పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు వి.నాగరత్నమ్మ,ఎస్.జఫారున్నిసా, ఎస్.షాజిదాబి, మీనాక్షి, విద్యార్థినులు పాల్గొన్నారు. అదేవిధంగా కేవీఆర్ గార్డెన్స్‌లోని కేవీఆర్ హైస్కూల్‌లో బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సాధు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించుకోవాలని, చదువుకోనివ్వాలని, ఎదగనివ్వాలన్నారు.

వంద శాతం ఫలితాలు సాధించాలి

కర్నూలు కల్చరల్: పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలని కర్నూలు ఉప విద్యాశాఖాధికారి, కోర్స్ డైరెక్టర్ కె.హనుమంత రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ హైస్కూల్‌లో కర్నూలు డివిజన్‌లోని అన్ని మండలాలు, పత్తికొండ, దేవనకొండ మండలాల గణితశాస్త్రం, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం పాఠశాల సహాయకులకు ఒక రోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుందాం

కర్నూలు(అర్బన్): భారత దేశ 73వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకుందామని ఏపీ ఎస్సీ, ఎస్టీ లాయర్స్ ఫోరం అధ్యక్షులు వై.జయరాజు పిలుపునిచ్చారు. ఈ నెల 26న ఉదయం 10.30 గంటలకు స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించనున్న గణతంత్ర వేడుకలకు న్యాయవాదులు, వృత్తి నిపుణులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

డీఈఈకి బాధ్యతల కేటాయింపు

కర్నూలు (టౌన్): మూడు నెలల పాటు మెడికల్ లీవ్‌లో ఉన్న నగరపాలక డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాధాకృష్ణ మంగళవారం విధుల్లో చేరారు. ఆయనకు విధులను కేటాయించారు. నగర పాలక సంస్థ పరిధిలోని పాణ్యం, కోడుమూరు అర్బన్ పరిధిలో ఎలక్ట్రికల్ పనులు, విలీన గ్రామాలతో పాటు 26వ వార్డు నుంచి 32వ వార్డు పరిధిలో సివిల్ వర్క్స్, వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్లు, శ్మశాన వాటికలు, పాఠశాలలు, కమ్యూనిటీ భవనాలు, టాయిలెట్లు, పార్కుల అభివృద్ధి, ఖాళీ స్థలాల పర్యవేక్షణ వంటి బాధ్యతలు అప్పగిస్తూ నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆరోగ్యంపై అవగాహన

కర్నూలు(హాస్పిటల్): జీవనశైలి మార్పులతో వ్యాధుల నిర్మూలన సాధ్యమని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఆయుష్ దత్తత గ్రామమైన కర్నూలు మండలం పసుపలలో మంగళవారం ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాలబాలికలకు, ఉపాధ్యాయులకు ఆరోగ్య సూత్రాలు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ వై.అనురాధ, ఉపాధ్యాయులు ఎం.సుకన్య కుమారి, బి.వెంకటేష్ పాల్గొన్నారు.

విచారణ జరపాలి

కర్నూలు(సెంట్రల్): కృష్ణా జిల్లా కేంద్రంగా బోగస్ డిప్లమో ఇన్ వెటర్నరీ సైన్స్ సర్టిఫికెట్లు భారీగా నిరుద్యోగులకు విక్రయిస్తున్నట్లు వస్తున్న ఆరోపణలపై విచారణ జరపాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫిబ్రవరిలో సచివాలయ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ రానుండడం, అత్యధికంగా పశుసంవర్ధకశాఖలో 4765 పోస్టులు ఉండడంతో బోగస్ సర్టిఫికెట్లను అమ్ముతున్నారని, ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 35వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'


గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరి పాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 35వ వార్డు 91వ వార్డు సచివాలయం పరిధిలోని ఉమామహేశ్వరమ్మ నగర్, అయ్యప్ప నగర్‌లలో స్థానిక కార్పొరేటర్ సాపురు మాధురి, వార్డు ఇన్‌చార్జ్ వీరయ్య ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించి లబ్ధిదారులకు బుక్‌లెట్లను పంపిణీ చేశారు. కాలనీలో ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని, సమస్యలు పరిష్కరించేందుకే మీ వద్దకు వచ్చానని ప్రజలతో పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సకాలంలో అందిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. కాగా డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాల సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ... సీఎం జగన్ రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందిస్తున్నా టీడీపీ నాయకులు ఓర్వలేకనే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇదంతా రాష్ట్రంలోని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. అర్హత కలిగిన వారందరికీ పార్టీలకు, రాజకీయాలకు, వర్గాలకు, మతాలకు, కులాలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సాన శ్రీనివాసులు, వైజా అరుణ, మిద్దె చిట్టెమ్మ, సంగాల సుదర్శన్‌రెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, లక్ష్మిరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివ శంకర్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల పార్లమెంట్ జిల్లా ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి సందేపోగు శివ, నాయకులు రంగప్ప, జగదీష్, పెద్దన్న, గోపీనాథ్, హనుమంతురెడ్డి, సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుబేర హోమం



సింహ వాహనంపై స్వామివారు, వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్ హరిహర క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీదేవి భూదేవి సహిత శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ 17వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం, మన్యుసక్త హోమం, కుబేర హోమం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. స్వామివారిని సింహ వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. స్వామివారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. మహిళలు జ్యోతి ఉత్సవం నిర్వహించారు. కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కల్లె చంద్రశేఖర్‌శర్మ, కార్యదర్శి హెచ్.కె.రాజశేఖర్ రావు, ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి హెచ్‌కె మనోహర రావు, కమిటీ సభ్యులు కల్లె వేణుగోపాల్ శర్మ,, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ స్వామి ఆలయంలో...

స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో రాజశ్యామల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహా గౌరీ అమ్మవారికి ప్రాతః కాల విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకారం, అర్చనలు, అభిషేకాలు, మంటపారాధన, శ్రీలలితా సహస్రనామ పారాయణం, రాజశ్యామల సహస్రనామార్చన, పాదుకానుష్టాన పూజలు జరిగాయి. సామూహిక కుంకుమార్చన జరిగింది. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కర్నూలు (సెంట్రల్): ఏపీ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆవిష్కరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్, వెంకటేశ్వర్లు, కోశాధికారి చంద్రశేఖర్, రాష్ట్ర ఫౌండర్, ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ శివరాముడు, జిల్లా గౌరవ సలహాదారు రాజశేఖర్, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చే సంస్థలపై చర్యలకు వినతి

కర్నూలు కల్చరల్: నకిలీ వెటర్నరీ సైన్స్ సర్టిఫికెట్లు ఇచ్చే సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వృత్తి విద్యా శాఖాధికారి జమీర్‌బాషాకు మంగళవారం ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకొని బోగస్ డిప్లొమా ఇన్ వెటర్నరీ సైన్స్ సర్టిఫికెట్లను నిరుద్యోగులకు భారీగా అమ్ముతున్నారని అలాంటి ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వస్తుండటంతో నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు గౌడ్, నగర అధ్యక్షుడు వెంకటేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు మునిస్వామి, నగర కార్యదర్శి బీసన్నలు డీవీఈఓకు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

5న జాతీయ ఉపకార వేతన పరీక్ష

కర్నూలు కల్చరల్: జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)ను ఫిబ్రవరి 5వ తేదీ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వి.రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరవుతున్న విద్యార్థినీ, విద్యార్థుల హాల్ టికెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ www. bare.a p.gov.inలో లాగిన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు డీఐఎస్ఈ కోడ్ ద్వారా లాగిన్ అయి తమ విద్యార్థుల హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ముఖ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వండి


డైరీని విడుదల చేస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ రామచంద్రయ్య

కర్నూలు(అగ్రికల్చర్): క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న పశుసంవర్ధకశాఖ పారా సిబ్బందికి ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న ముఖ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ 2023 డైరీని జేడీ డాక్టర్ రామచంద్రయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా చైర్మన్ మాట్లాడుతూ... క్షేత్రస్థాయి సిబ్బంది ముఖ హాజరు వల్ల ఇబ్బందులు పడుతున్నారని జేడీ దృష్టికి తెచ్చారు. ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో జేవీవో, వీఎల్‌వో అసోసియేషన్ నాయకులు రంగన్న, జనార్దన్‌రెడ్డి, బాబురావు, యూసుఫ్, ఆదినారాయణమ్మ, సులోచనమ్మ, శ్రీరాములు, సుబ్బరాయుడు, సహా అధ్యక్షుడు సుధాకర్, వీపీ నాయకులు లక్ష్మిదేవి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్ సామాజిక బాధ్యత ఆదర్శణీయం

- 336 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్పుల అందజేత


స్కాలర్‌షిప్పులు అందుకున్న విద్యార్థులు

కర్నూలు(సెంట్రల్): మలబార్ గోల్డ్ సంస్థ స్కాలర్‌షిప్పులు మంజూరు చేయడం హర్షణీయమని కలెక్టర్ సతీమణి స్వర్ణలత, ఏపీ మహిళా కమిషన్ రాయలసీమ ఇన్‌చార్జ్ రుతియాబీ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మలబార్ గోల్డ్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 336 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.8 వేల నుంచి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.30 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదుకోవడానికి బాధ్యతగా మలబార్ గోల్డ్ సంస్థ ముందుకు రావడం ఆదర్శణీయమన్నారు. ఈ సంస్థ స్ఫూర్తితో మరిన్ని కార్పొరేట్ సంస్థలు తమ సంపాదనలో 5 శాతాన్ని సామాజిక సేవకు వినియోగించాలని కోరారు. ఐసీడీఎస్ పీడీ కేఎల్ఆర్‌కే కుమారి మాట్లాడుతూ..సామాజిక సేవను మలబార్ గోల్డ్ బాధ్యతగా భావించిందన్నారు. జీవితంలో ప్రతి ఒక్కరూ పేదలకు సాయం చేయాలన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ఫైయాజ్, సమీర్, సుధాకర్, మన్సూర్, అరుణ్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆర్థిక సాయం

కర్నూలు కల్చరల్: కర్నూలు బి.క్యాంప్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులకు మలబార్ గోల్డ్ ట్రస్ట్ ఆర్థిక సాయం చేసింది. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి మాట్లాడుతూ మలబార్ గోల్డ్ వారు కళాశాలకు చెందిన 16 మందికి రూ.1,30,000 నగదును ప్రోత్సాహకంగా అందజేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నాయక్, విజయశేఖర్, గిరిజారాణి, సుజాత, లావణ్య పాల్గొన్నారు.

రైల్వే పాస్‌లను పునరుద్ధరించాలి


కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

కర్నూలు కల్చరల్: జర్నలిస్టుల రైల్వే పాస్‌లను పునరుద్ధరించాలని కోరుతూ కేంద్ర ఐటీ శాఖ మంత్రి దేవు సిన్హ్ చౌహాన్, మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్‌కు ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు మంగళవారం ప్రభుత్వ అతిథి గృహంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్షులు శివకుమార్, నాయకులు నాగేంద్ర మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులకు రైల్వే ప్రయాణానికి రైల్వే పాస్ రాయితీ ఉండేదని, కోవిడ్ తర్వాత రాయితీని తొలగించాలన్నారు. మళ్లీ రైల్వే పాస్‌ల రాయితీలను పునరుద్ధరించలేదన్నారు.

'కాంప్లెక్స్‌ను కూల్చివేయాలి'

కర్నూలు(సెంట్రల్): నగరంలోని బళ్లారి చౌరస్తా ప్రాంతంలో ఉన్న అలీషా మసీదు స్థలంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను కూల్చివేయాలని ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రసూల్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.